నేడు జిల్లాకు యుటిఎఫ్ రణభేరి జాతా

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై చేపట్టిన యుటిఎఫ్ రణభేరి జాతా బుధవారం జిల్లాలో ప్రవేశిస్తుందని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జయకర్, షరీఫ్ తెలిపారు. ఈ నెల 15న తునిలో ప్రారంభమైన జాతా కాకినాడ, ఎఎస్ఆర్ జిల్లాల్లో సాగిందని తెలిపారు. ఈ జాతా రంపచోడవరం మీదుగా గోకవరం వద్ద తూర్పు గోదావరి జిల్లాలో ప్రవేశిస్తుందని తెలిపారు. ఈ జాతాకు ముఖ్యఅతిథిగా ఉభయ గోదావరి జిల్లాల టీచర్ ఎంఎల్‌సి గోపి మూర్తి, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి అరుణకుమారి, టివిజిఆర్.చక్రవర్తి హాజరవుతారని తెలిపారు. జిల్లాలోని ఉపాధ్యాయులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో ఈ జాతాలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమస్యలపై నిర్వహించే ఈ జాతాను విజయవంతం చేయాలన్నారు.

కష్టం బారెడు... జీతం మూరెడు

- అరకొర వేతనమే దిక్కు
- మూడు నెలలుగా పెండింగ్
- దుర్భర జీవితాలను అనుభవిస్తున్న వైనం
- పాఠశాల పారిశుధ్య కార్మికుల వెతలు

పాఠశాలల్లో పనులు చేస్తున్న పారిశుధ్య కార్మికులు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ప్రభుత్వ విద్యారంగాన్ని సర్కార్ పూర్తిగా నిర్లక్ష్యం చేస్తుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. నూతన విద్యా విధానాలను ప్రవేశపెట్టి పలువురు పేద, మధ్యతరగతి విద్యార్థులకు ప్రభుత్వ విద్యను దూరం చేస్తోందనే విమర్శలు తల్లిదండ్రుల నుంచి వెల్లువెత్తుతున్నాయి. గత, ప్రస్తుత ప్రభుత్వాలు పాఠశాలల విలీనం పేరుతో విద్యా వ్యవస్థను భ్రష్ట పట్టిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే పాఠశాలల పారిశుధ్య కార్మికులను నిర్లక్ష్యం చేస్తున్నాయి. తల్లికి వందనం రూ.15 వేలు ఇస్తున్నామని చెప్పి అందులో రూ.2 వేలు కోత విధిస్తున్నారు. పాఠశాలల నిర్వహణ పేరుతో ఈ సొమ్మును మినహాయిస్తున్నప్పటికీ అందుకోసం ఖర్చు చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుంది. దీనిలోభాగమే పారిశుధ్య కార్మికులకు అరకొర వేతనాలను మాత్రమే అందిస్తుంది. పాఠశాలలను నిరంతరం పరిశుభ్రంగా ఉంచేందుకు శ్రమిస్తున్న వారి సమస్యలను పాలకులు గాలికొదిలేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో 2,110 ప్రాథమిక, 214 ప్రాథమికోన్నత, 200 ఉన్నత పాఠశాలల్లో సుమారు 4,200 మంది పని చేస్తున్నారు. పాఠశాలల్లో విద్యార్థుల నిష్పత్తి ప్రకారం పారిశుధ్య కార్మికులను నియమించారు. 300 మందికి లోపు విద్యార్థులు ఉంటే ఒక ఆయాను, 301 నుంచి 600 మంది విద్యార్థులు ఉంటే ఇద్దరు, 601 నుంచి 900 మందికి ముగ్గురు, 900 పైగా విద్యార్థులు ఉంటే నలుగురిని నియమించుకునేందుకు ప్రభుత్వం అనుమతించింది. ఈ ఏడాది పాఠశాలలు తెరిచే ముందే తల్లిదండ్రుల కమిటీ ఆధ్వర్యంలో ఆయాలను నియమించుకున్నారు. ప్రాథమిక పాఠశాలలో పారిశుధ్యం నిర్వహించే వారికి గతంలో నెలకు రూ.2 వేలు, ప్రాథమికోన్నత పాఠశాలకైతే రూ.2,500, ఉన్నత పాఠశాలలో పనిచేసేవారికి వారికి రూ.4 వేలు గౌరవ వేతనంగా నిర్ణయించి అందించేవారు. గత విద్యా సంవత్సరం నుంచి అందరికీ రూ.6 వేలు ఇస్తున్నారు.

కుటుంబ పోషణ ఎలా..?

ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు, పరిసరాలను పరిశుభ్రం చేసేందుకు నియమించిన ఆయాలకు అరకొర వేతనాలను మాత్రమే ఇస్తున్నారు. రూ. 6 వేలతో తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. నిత్యవసరాల ధరలు పెరుగుతున్న తరుణంలో ప్రభుత్వం తమకు కనీస వేతనాలను అమలు చేయాలంటూ కోరుతున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిరంతరం పాఠశాలలను అంటూ పెట్టుకుని పారిశుధ్య సేవలు వీరు అందిస్తున్నారు. అయితే ప్రభుత్వం తగిన గుర్తింపు ఇవ్వకపోవడంతో కనీస వేతనాలకు నోచుకోవడం లేదు. అవి కూడా మూడు నెలలుగా పెండింగ్లో ఉన్నాయి.

తగినన్ని నిధులున్నా...

ఒక్కొక్క ఆయాకు నెలకు రూ.6 వేల ప్రకారం ఏడాదికి 10 నెలలు గౌరవ వేతనం ఇస్తున్నారు. తల్లికి వందనంలో కోత విధిస్తున్న ప్రభుత్వం ఒక్కో విద్యార్థి నుంచి రూ.2 వేలు వరకూ పక్కన ఉంచుతుంది. కానీ ఇప్పటికీ ఈ నిధుల నుంచి ఆయాలకు వేతనం చెల్లించడం లేదు. తగినన్ని నిధులు ఉన్నా, జిల్లా విద్యాశాఖ అధికారులు వేతనాలు చెల్లించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. కావున ప్రభుత్వం కనీస వేతనాలను అమలు చేయాలని డిమాండ్లు ఆయాల నుంచి వినిపిస్తున్నాయి.

కనీస వేతనాలు ఏవీ?

పాఠశాలను పరిశుభ్రంగా ఉంచేదుకు ఏళ్లుగా పని చేస్తున్నాను. ఇచ్చే అరకొర వేతనాలు ఎప్పుడూ పెండింగ్లోనే ఉంటున్నాయి. కనీస వేతనాలు ఇవ్వడంలో నిర్లక్ష్యం జరుగుతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యను పరిష్కరించాలి.

- ఎన్.సునీత, ఎంపిపి పాఠశాల, కొండెవరం, యు.కొత్తపల్లి మండలం

కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలి

గత మూడు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదు. ఇచ్చే అరకొర వేతనాలు సరిపోవడం లేదు. కుటుంబాలను ఎలా పోషించుకోవాలో అర్థం కావడం లేదు. గ్లౌజులు, యాప్రాన్ మాత్రమే ఇస్తున్నారు. బూట్లు ఇతర రక్షణ పరికరాలు ఇవ్వడం లేదు. కళ్ళు మండిపోతున్నాయి.

-గండేపల్లి సత్యవతి, పాఠశాల పారిశుధ్య కార్మికురాలు, పిఠాపురం

కనీస వేతనం ఇవ్వాలి

నిరంతరం పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచేందుకు శ్రమిస్తున్న కార్మికులకు జిఒ 07 ప్రకారం కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలి. చదరపు గజాలను బట్టి పాఠశాలలకు వర్కర్లను నియమించాలి. స్కూల్ అభివృద్ధి కమిటీ పలు చోట్ల ఇష్టానుసారంగా మారుస్తున్నారు. పెండింగ్ వేతనాలు తక్షణమే విడుదల చేయాలి.

-చంద్రమళ్ళ పద్మ, సిఐటియు నాయకురాలు

ధర్నా చేస్తున్న విఒఎలు

సమస్యల పరిష్కారం కోసం విఒఎల ధర్నా

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం

సమస్యలను పరిష్కరించాలంటూ విఒఎలు మంగళవారం డిఆర్‌డిఎ పీడీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. బకాయి వేతనాలు చెల్లించాలని, ఆన్‌లైన్ పనిభారాన్ని తగ్గించాలని, కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని నినదించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.పవన్ ధర్నాకు మద్దతు తెలిపి మాట్లాడారు. సమస్యలను పలుమార్లు అధికారులు, ప్రభుత్వానికి విన్నవించుకున్నా స్పందన కరువైందన్నారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా సంఘం పిలుపు మేరకు పీడీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారన్నారు. 5జి మొబైల్ ఇవ్వకుండా కింది స్థాయిలో ఆన్‌లైన్ వర్కు చేయలేదని వేధింపులకు గురిచేయడం అన్యాయమన్నారు. ప్రతి పనికి టార్గెట్స్ ఇచ్చి ఒత్తిడి పెంచుతున్నారన్నారు. వేతనాలు సక్రమంగా చెల్లించకుండా పని ఎలా చేస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విఒఎల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రవి

వినతిపత్రం అందిస్తున్న నాయకులు

స్వరూపరాణి, మహాలక్ష్మి మాట్లాడుతూ విఒఎలపై రాజకీయ వేధింపులు, అక్రమ తొలగింపులు ఆపాలన్నారు. గ్రూప్ ఇన్సూరెన్స్ రూ.10 లక్షలు ఇవ్వాలని, అర్హులకు సిసిలుగా ప్రమోషన్ ఇవ్వాలని, జీతాలు సకాలంలో చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిఆర్‌డిఎ అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సత్యనారాయణకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శిరీష, గణికమ్మ, బేబి, కుసుమకుమారి, సత్యవతి, సీతామహాలక్ష్మి, జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన విఒఎలు పాల్గొన్నారు.

కొవ్వూరు- దొండపూడి బస్సు సర్వీసు పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - గోపాలపురం

కొవ్వూరు నుంచి భీమోలు మీదుగా దొండపూడికి బస్సు సర్వీసును ఏర్పాటు చేయాలని ఎంఎల్‌ఎ మద్దిపాటి వెంకటరాజు కొవ్వూరు ఆర్‌టిసి డిపో మేనేజర్‌ను కోరారు.. డిపో మేనేజర్‌గా ఎన్.అభిరాం నాయక్ ఇటీవల బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎను మంగళవారం ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్ప గుచ్చం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడారు. గతంలో ఉండే బస్సు సర్వీసును నిలిపేయడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారని తెలిపారు. కొవ్వూరు నుంచి తాళ్లపూడి, భీమోలు, దొండపూడి వరకు బస్సు సర్వీసును పునరుద్ధరించాలని మేనేజర్ కోరారు. ఉన్నతాధికారులకు దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్లి బస్సు సర్వీసును ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని మేనేజర్ తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదెల మృత్యువాత

బిక్కవోలు : కొమరిపాలెం గ్రామంలో విద్యుదాఘాతానికి గురై రెండు గేదెలు మృత్యువాత పడ్డాయి. గ్రామానికి చెందిన కాళ్ల వీర్రాజు రోజు మాదిరిగానే తన గేదెలను ఇంటి నుంచి కాలువ వద్దకు తోలుకెళ్లాడు. రేవులో కరెంటు వైర్లు తెగిపడి ఉండడంతో కాలువలోకి దిగిన రెండు గేదెలు విద్యుదాఘాతానికి గురై మృత్యువాత పడ్డాయని వీర్రాజు తెలిపాడు. వీటి విలువ రూ.2లక్షల వరకూ ఉంటుందని ఆయన తెలిపారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం చోటు చేసుకుందని తెలిపారు. ప్రభుత్వం స్పందించి తమ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరాడు.

ఉపకరణాల అందజేత

కొవ్వూరు : వికలాంగులకు ఉపకరణాలు అందించేందుకు కొవ్వూరు గవర్నమెంట్ హైస్కూల్ లో మంగళవారం మెడికల్ అసెస్మెంట్ క్యాంపు నిర్వహించారు. అలిన్కో సంస్థ ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని ఎంఎల్‌ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. సహిత విద్యా విభాగం కార్యక్రమంలో భాగంగా మండలంలో గల అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలో చదువు తున్న, ఇంటి వద్దనే ఉంటున్న వికలాంగ విద్యార్థులకు ఉపకరణాలు అందిస్తారని తెలిపారు. అనంతరం కొంత మంది వికలాంగుకు వీల్ చైర్లు, రోలెటర్లు, వినికిడి యంత్రాలు, మూడు చక్రాల కుర్చీలు, సిపి చైర్లు, ఎంఆర్ కిట్లు, చంక కర్రలు, బ్రెయిలీ కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష జిల్లా ఎపిసి సుభాషిణి, మున్సిపల్ చైర్ పర్సన్ భావన రత్నకుమారి, ఎఎంసి చైర్మన్ నాదెండ్ల శ్రీరామ్, మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'

గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహామూర్తి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

కల్లు గీత కార్మికులను ఆదుకోవాలని తూర్పుగోదావరి జిల్లా మద్య నిషేధ అబ్కారీ కార్యాలయం సీనియర్ అధికారి ప్రతుషాకు ఎపి కల్లుగీత కార్మిక సంఘం ప్రతినిధులు మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహామూర్తి మాట్లాడారు. కల్లు గీత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. బెల్ట్ షాపులను తక్షణమే తొలగించలన్నారు. ప్రతి కల్లుగీత కార్మిక కుటుంబానికీ గుర్తింపు కార్డు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉన్నత స్థాయి అధికారులు తయారు చేసిన మద్యం పాలసీని యథావిధిగా అమలు చేయాలన్నారు. బెల్ట్ షాపులను తొలగించేందుకు విఆర్ఒ, సచివాలయ పోలీసులతో గ్రామ కమిటీలు వేయాలన్నారు. గీత వత్తి చేస్తూ చనిపోయిన వారికి రూ.5 లక్షలు, శాశ్వత వికలాంగులకు రూ.10 లక్షలు, తాత్కాలిక వికలాంగులకు రూ.2 లక్షలు పరిహారంగా ఇవ్వాలన్నారు. అన్ సీజన్‌లో ఇతర వృత్తులు చేసుకునేందుకు 50 శాతం సబ్సిడీతో కూడిన రూ.5 లక్షల రుణం అందించాల న్నారు. కేరళ రాష్ట్రంలో మాదిరిగా కల్లుగీత వృత్తికి రక్షణ, ఉపాధి, గ్యారెంటీ, కల్లుకు మార్కెట్ సౌకర్యం కల్పించి సహకార సంఘాలను బలోపేతం చేయాలన్నారు. నీరా కేఫ్‌లను వెంటనే పెట్టాలన్నారు. చెట్టు పన్ను రూ.10 చొప్పున గీత కార్మికుల నుంచి కట్టించుకోవాలన్నారు. కల్లును శీతల పానీయంగా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బొల్ల ముసలయ్యగౌడ్, వి.శ్రీనివాస్‌రాయుడు, బుజ్జి, గుబ్బల నరసింహస్వామి జుత్తిగ పోసేరావు తదితరులు పాల్గొన్నారు

హక్కుల నేత బొజ్జా తారకం

ప్రజాశక్తి-కడియం

హక్కుల నేత బొజ్జా తారకం అని పలువురు నాయకులు కొనియాడారు. పొట్టిలంక కమ్యూనిటీ హాల్ ఆవరణలో, అంబేద్కర్ యువజన సంఘం అధ్వర్యంలో మంగళవారం, ప్రజా న్యాయవాది బొజ్జా తారకం 9వ వర్ధంతిని నిర్వహించారు. తొలుత బొజ్జా తారకం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్క వెంకటరత్నం రాజు మాట్లాడారు. తారకం తెలంగాణ ప్రాంతంలో అంబేద్కర్ యువజన సంఘాలు ఏర్పాటు చేసి దళితుల ఉద్యమాలకు నాయకత్వం వహించారన్నారు. కారంచేడు నరమేధం తర్వాత హైకోర్టు ప్రభుత్వం న్యాయవాది పదవికి రాజీనామా చేసి దళిత మహాసభ స్థాపించారని తెలిపారు. అప్పటి నుంచి లక్షింపేట దళితులపై జరిగిన మారణకాండ వరకు అనేక పోరాటాలకు న్యాయకత్వం వహించారని తెలిపారు. ఆయన అడుగుజాడల్లో నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది బడుగు సత్తిబాబు, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు నక్కా చంటిబాబు, బడుగు సుధాకర్, నక్కా ఆనందకుమార్, గుమ్మడి అర్జున్, కొమరపు శివ, నక్కా అశోక్, బడుగు శ్రీను, రేముళ్ళ సురేష్, నక్కా బాబి తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర సేవలు ఆదర్శనీయం

విశ్రాంత డిఎస్‌పి వాసంశెట్టి రాజగోపాల్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

స్వర్ణాంధ్ర సేవలు ఆదర్శనీయమని విశ్రాంత డిఎస్‌పి వాసంశెట్టి రాజగోపాల్ అన్నారు. మంగళవారం లాలా చెరువులోని స్వర్ణాంధ్ర నైపుణ్య శిక్షణ కేంద్రం హాల్లో 79వ బ్యాచ్ కుట్టు శిక్షణ ముగింపు ఉత్సవం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి రాజగోపాల్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళల స్వయం ఉపాధి కోసం స్వర్ణాంధ్ర సేవా సంస్థ ఉచితంగా శిక్షణ అందించడంతో పాటు మెటీరియల్ కూడా ఉచితంగా అందించడం అభినందనీయమన్నారు. స్వర్ణాంధ్రకు దాతలు సహకరించాలని కోరారు. తన వంతు సాయం అందించడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమానికి స్వర్ణాంధ్ర ముఖ్య నిర్వాహకులు డాక్టర్ గుబ్బల రాంబాబు అధ్యక్షత వహించారు. రాంబాబు మాట్లాడుతూ శిక్షణానంతరం ఒంటరి మహిళలకు, ఆర్థికంగా బలహీనంగా ఉన్నవారికి ఇప్పటి వరకు సుమారు 520 కుట్టుమిషన్లు అందించామన్నారు. 27 ఏళ్లుగా 20వేల మందికి పైబడి కుట్టు, మగ్గం, బ్యూటీషియన్, కంప్యూటర్లలో ఉచిత శిక్షణ అందించామన్నారు. ఇక్కడ శిక్షణ పొందిన అనేకమంది ప్రభుత్వ పాఠశాలల్లో క్రాఫ్ట్ టీచర్లుగా పనిచేస్తున్నారన్నారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు రాజగోపాల్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ బ్యాంక్ విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు ఎమ్‌డి.మస్తాన్, పప్పు వీరభద్రరావు, చంద్రశేఖర్, శిక్షణ టీచర్ దివ్యసింధు, స్వర్ణాంధ్ర సిబ్బంది మీరాకుమారి,

గణేష్ ,శంకర్రావు తదితరులు పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన విశ్రాంత డిఎస్పి వాసంశెట్టి రాజగోపాలను స్వర్ణాంధ్ర సేవా సంస్థ పక్షాన గుబ్బల రాంబాబు దుస్సాలువుతో సత్కరించి జ్ఞాపికను అందించారు. 80వ బ్యాచ్ శిక్షణ ప్రారంభమైందని ఆసక్తి గల మహిళలు స్వర్ణాంధ్ర సేవా సంస్థ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

టార్గెట్ బాల్‌లో చాగల్లు విద్యార్థుల విజయభేరి

ప్రజాశక్తి - చాగల్లు

విశాఖలో ఈ నెల 13, 14 తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ టార్గెట్ బాల్ పోటీల్లో చాగల్లు జడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులు విజయభేరి మోగించారని పీడీ విజయలక్ష్మి తెలిపారు. ఈ పాఠశాల నుంచి 12 మంది బాలురు, 12 మంది బాలికలు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. బాలురు, బాలికలు, మిక్స్‌డ్ విభాగాల్లో ప్రథమ స్థానంలో నిలిచారని తెలిపారు. బెస్ట్ షూటర్‌గా బాలనంద కిషోర్, ఆర్.నవ్య నిలిచారని తెలిపారు. ఈ విజయం పట్ల ఇన్‌ఛార్జి హెచ్ఎం రాళ్లపల్లి వరప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులను ఉపాధ్యాయులు, సిబ్బంది, గ్రామస్తులు, ఎస్ఎంసి కమిటీ చైర్మన్ గోపాలకృష్ణ అభినందించారు.

ఓజోన్ పొర పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - యంత్రాంగం

ఓజోన్ పొర పరిరక్షణ అందరి బాధ్యత అని పలువురు వక్తలు అన్నారు.జిల్లాలో ఓజోన్ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఓజోన్ రక్షణ ఆవశ్యకతపై సదస్సులు, సమావేశాలు, ర్యాలీఉ నిర్వహించారు.

రాజమహేంద్రవరం : ఓజోన్ పొరను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని లాలా చెరువు నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల హెచ్ఎం యు.విజయలక్ష్మి అన్నారు. ఓజోన్ దినోత్సవం సందర్భంగా పాఠశాల అవాస ప్రాంతంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి ఓజోన్ పొర రక్షణ ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు డి.శ్రీదేవి, మంగారాణి, రమేష్, చంద్రశేఖర్, సుబ్రమణ్యం, వై.శ్రీదేవి, సుధీర్, బాలయోగి, ధర్మారావు, నాగేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

గోపాలపురం : జీవ మనుగడకు అవసరమైన ఓజోన్ పొరను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఎఎస్ఒ జోడాల వెంకటేశ్వరరావు, డిప్యూటీ తహశీల్దార్ సాంబశివరావు అన్నారు. మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో ఉద్యోగులు 'సేవ్ ఓజోన్' అనే ప్ల కార్డులతో ఓజోన్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సహాయకులు నల్లరాజు, సర్వేయర్ తులసి మల్లి, పాల్గొన్నారు.

ఒ3 ఆకారంలో నిల్చున్న విద్యార్థులు

బిక్కవోలు : పందలపాక శ్రీ పడాల పెద పుల్లారెడ్డి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. హెచ్ఎం చిర్ల శ్రీనివాస్‌రెడ్డి పర్యవేక్షణలో వ్యాయామదర్శకులు ద్వారంపూడి యువ రాజారెడ్డి, సైన్స్ ఉపాధ్యాయులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. విద్యార్థులకు ఓజోన్ పొరపై అవగాహన కల్పించారు. చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. లయన్స్ క్లబ్ గొల్లలమామిడాడ శ్రీ సూర్య సౌజన్యంతో విజేతలకు మెడల్స్, ప్రశంస పత్రాలను అందజేశారు. మధ్యాహ్నం ఓజోన్ పరిరక్షణపై అవగాహన ర్యాలీ మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అభివద్ధి కమిటీ అధ్యక్షులు కోనాల సత్తిరాజు, ఉపాధ్యాయ ప్రతినిధి కర్రి వీర్రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాళ్లపూడి : జీవరాశికి రక్షణగా ఉన్న ఓజోన్ పొరను రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని పైడిమెట్ట ఎంపిపిపి పాఠశాల హెచ్ఎం దున్నా దుర్గారావు అన్నారు. అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవాన్ని మంగళవారం పాఠశాలలో నిర్వహించారు. ఓజోన్ పొర వల్ల కలిగే లాభాలు, ఓజోన్ పొరను రక్షించుకోవాల్సిన ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. అడవులను పెంచడమే కాకుండా ప్రతి వ్యక్తి మొక్కలను నాటి వాటిని పెంచి పోషించాలని విద్యార్థులకు సూచించారు.

'వాహన మిత్ర'కు దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి - సీతానగరం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న వాహన మిత్ర పథకానికి అర్హులైన ఆటో, ట్యాక్సీ డ్రైవర్లు దరఖాస్తు చేసుకోవాలని రాజానగరం ఎంఎల్‌ఎ బత్తుల బలరామకృష్ణ పిలుపునిచ్చారు. ఈ పథకం ఆటో డ్రైవర్లకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. అర్హత ఉన్న డ్రైవర్లు సచివాలయానికి వెళ్లి పథకం కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. ఇందులో భాగంగానే ఈ పథకాన్ని అమలు చేస్తుందన్నారు.

గోకవరం : మండలంలోని వాహన మిత్ర పథకానికి సంబంధించి 2023కు చెందిన 383 మంది లబ్ధిదారులు పేర్లను రెవెన్యూవల్ చేయించుకోవాలని ఎంపిడిఒ ఎం.గోవింద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు ఈ నెల17 నుండి 19 వరకు తమ గ్రామంలో గ్రామ సచివాలయంలో వాహన మిత్ర పథకం కోసం డిజిటల్ అసిస్టెంట్ ద్వారా వెరైఫికేషన్ చేయించుకోవాలని తెలిపారు. కొత్తగా దరఖాస్తులు చేయనవసరం లేదన్నారు. రెన్యువల్ లిస్ట్‌లో పేరు లేని వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అంగీకార్-2025 పోస్టర్ ఆవిష్కరణ

రాజమహేంద్రవరం : అంగీకార్-2025 పోస్టర్‌ను అదనపు కమిషనర్ పివి.రామలింగేశ్వర్ మంగళవారం నగరపాలక సంస్థలోని తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ అంగీకార్ అనేది ప్రధాన మంత్రి ఆవాస్ యోజన - అర్బన్ 2.0 పథకంపై ప్రజల్లో అవగాహన పెంచడానికి ఉద్దేశించిన కార్యక్రమమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ శైలజావల్లీ, ఎంహెచ్ఒ వినూత్న, మేనేజర్ ఎమ్‌డి అబ్దుల్ మాలిక్, సీనియర్ అసిస్టెంట్ సఫియా, సిఎల్‌టిసి రవికుమార్, సిఎంఎం వి.రామలక్ష్మి పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

ప్రజాశక్తి - శంఖవరం

అన్నవరంలో విద్యుదాఘాతంతో ఒక యువకుడు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మంగళవారం అన్నవరం గ్రామ శివారులో నూతనంగా వేసిన లేఅవుట్ స్థలంలో విద్యుత్ మరమ్మతులు చేస్తుండగా బర్ల సోమరాజు విద్యుదాఘాతానికి గురయ్యి మృతి చెందారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్ఐ హరిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

అమలాపురం మండలం తాండవపల్లి పంచాయతీ పరిధిలోని శెట్టిపల్లి పంట కాలువలో సుమారు 25 నుంచి 30 సంవత్సరాల మధ్య వయసు గల గుర్తు తెలియని పురుషుడు మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న అమలాపురం తాలూకా పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మంగళవారం కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే తాలూకా పోలీస్ స్టేషన్ ఈ నం. 9440796562, 9440796525లను సంప్రదించాలన్నారు.

వివరాలను వెల్లడిస్తున్న డిఎస్‌పి దేవకుమార్

బైకుల చోరీ ముఠా అరెస్ట్

ప్రజాశక్తి - పెరవలి

అంతర్ జిల్లా బైకుల చోరీ ముఠాను పోలీసులు పట్టుకున్నారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో కొవ్వూరు డిఎస్‌పి జి.దేవకుమార్ ఈ వివరాలను వెల్లడించారు. రాజమహేంద్రవరం, అనపర్తి, విశాఖపట్నం, అమలాపురం పెనుగొండ, పెనుమంట్ర తదితర ప్రాంతాల్లో బైకుచోరీలు ఎక్కువ కావడంతో నిఘా పెట్టామన్నారు. ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు, సిబ్బంది, కొవ్వూరుకు చెందిన ఇద్దరు కానిస్టేబుల్స్ బృందంగా ఏర్పడి పెరవలి సెంటర్‌లో తనిఖీలు చేపట్టారన్నారు. ఈ తనిఖీల్లో భాగంగా సరైన రికార్డులు లేనివారిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. ఆరా తీయగా దొంగల ముఠాగా గుర్తించారని తెలిపారు. పెరవలి మండలం ఖండవల్లికి చెందిన తుమ్మగంటి ధనుష్, నెక్కంటి యువరాజు, విశ్వనాధుల దేవిశ్రీప్రసాద్, రాజఒమ్మంగి గ్రామానికి చెందిన అబ్బిరెడ్డి పాపారావు బృందంగా ఏర్పడి బైకులు చోరీ చేస్తున్నారని తలెఇపారు. వీరి నుంచి రూ.20లక్షల విలువైన 26 బైకులను రికవరీ చేశామని తెలిపారు. ఇంటి వద్ద తాళాలు వేసి ఉన్న మోటర్ బైకులను వీరు చాకచక్యంగా చోరీ చేస్తారన్నారు. సిఐ తిలక్ సహకారంతో ఈ ముఠాను పట్టుకున్న ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు, ట్రైనింగ్ ఎస్ఐ కె.సౌజన్య, కానిస్టేబుల్స్ కె.శ్రీహరి, కె.నరేంద్ర, ఎం.ముత్యాలు, ఎస్.గంగాధరరావు, ఎస్.ప్రసాద్, కె.రమేష్, ఎం.హనుమంతు, ఎన్.శ్రీనుపవన్, జి.సాంబయ్య, జాకీర్ రెహ్మాన్, అఫాసరి బేగ్, జి.అనిల్‌లను అభినందించి రివార్డులు అందించారు.

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రేమించిన అమ్మాయి తిరస్కరించడంతో మనస్తాపం చెందిన ఒక యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చెందాడు. రాజమహేంద్రవరం సంజీవ నగర్‌కు చెందిన కుసుమ ఎలీషా (22) అనే యువకుడు ఎడిబి రోడ్డు లోని చైతన్య పౌల్ట్రీలో పని చేస్తున్నాడు. ఒక అమ్మాయిని ప్రేమించాడు. ఆమె తిరస్కరించడంతో తన రూములో ఉరి వేసుకుని మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వి.మౌనిక తెలిపారు.

భార్య, భర్తలకు పదేళ్ల జైలు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని జి.రాగంపేట గ్రామంలో ఇరుగుపొరుగు ఇళ్లకు మధ్య వచ్చిన వివాదంలో ఆదిన ప్రసాద్, ఆదిన లక్ష్మిలు తమ పక్కింటి మహిళ పాలాని మంగ(60)ను మెట్లపై నుంచి తోసివేయటంతో ఆమె మృతి చెందింది. 2022 డిసెంబర్ ఒకటతో తేదీన జరిగిన ఈ సంఘటనపై అప్పటి ఎస్ఐ పి.శివకుమార్ కేసు నమోదు చేశారు. నిందితులను అరెస్టు చేశారు. ఈ కేసులో వాదోపవాదాల అనంతరం పెద్దాపురం అసిస్టెంట్ సెషన్స్ జడ్జి డాక్టర్ కె.దీప దైవకృప భార్యాభర్తలకు ఒక్కొక్కరికి పదేళ్లు జైలు శిక్షతోపాటు, ఒక్కొక్కరికి రూ.10 వేలు జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు చెప్పారు. ఈ కేసును మొదట అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆర్.కామేశ్వరరావు, తర్వాత అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గన్నంరాజు వినయ తేజ వాదించారు.

సేంద్రియ ఎరువులు వాడాలి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

యూరియాకు బదులుగా సేంద్రియ ఎరువులను వినియోగించాలని మండల వ్యవసాయ అధికారి బి.రాజారావు రైతులకు సూచించారు. మండలంలోని చిలకపాడు, కాల్దారి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువుల వాడకం, యూరియాకు ప్రత్యామ్నాయంగా సేంద్రియ, జీవన ఎరువుల వినియోగం గురించి వివరించారు. అధిక యూరియా వాడడం వల్ల కలిగే అనర్ధాలు, వివిధ ఎరువులకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రాయితీల గురించి తెలిపారు, సమగ్ర భూ పోషక యాజమాన్య పద్ధతులైన నానో ఎరువులు, ముఖ్యంగా నానో యూరియా, నానో డిఎపి వల్ల కలిగే లాభాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సొసైటీ అధ్యక్షులు, రైతులు, విఎఎలు స్వప్న, సాయి పాల్గొన్నారు.

నేడు సీతానగరం మండల సమావేశం

సీతానగరం : నేడు సీతానగరం మండల సర్వసభ్య సమావేశంలో ఎంపిడిఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఉదయం పది గంటలకు జరుగుతుందని అధికారులు తెలిపారు. ఎంపిపి గుర్రాల జ్యోత్స్న అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి సభ్యులందరూ సకాలంలో హాజరవ్వాలన్నారు.

రూ.636.97 కోట్ల రుణాలు అందించడమే లక్ష్యం

డిఆర్‌డిఎ పీడీ మూర్తి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

జిల్లాలో 10,635 సంఘాలకు రూ.636.97 కోట్లు రుణాలు అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని డిఆర్‌డిఎ పీడీ ఎన్‌విఎస్.మూర్తి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డిజిటల్ సూక్ష్మ రుణ ప్రణాళికపై బ్యాంకర్లతో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మూర్తి మాట్లాడారు. జిల్లాలో ప్రస్తుత 2025–26 ఆర్థిక సంవత్సరంలో 7,586 స్వయం సహాయక సంఘాలకు రూ.507.54 కోట్ల రుణాలు బ్యాంకుల ద్వారా మంజూరు చేశామన్నారు. ప్రతి స్వయం సహాయక సంఘం నుంచి ఇద్దరు మహిళా సభ్యులు పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి, అందుకు అనుసరించి అవకాశం కల్పించే విధంగా రుణ సదుపాయాలు ఏర్పాటు చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని మహిళల ఆర్థిక సాధికారతను పెంపొందించడమే లక్ష్యంగా రూపొందించిందన్నారు. స్వయం ఉపాధి పథకాల ద్వారా మహిళలు తమ సొంత వ్యాపారాలు, చిన్న పరిశ్రమలు ప్రారంభించి, స్థిరమైన ఆదాయ సాధన ద్వారా కుటుంబాల జీవనోపాధిని మెరుగుపర్చొచ్చన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం మహిళలకు ఆర్థిక అవకాశాలు, సామర్థ్యాభివృద్ధి మార్గాలను అందిస్తూ, సమాన అవకాశాల కల్పనలో విశేషంగా కృషి చేస్తోందన్నారు. ఈ సమావేశంలో అదనపు పీడీ వై.సత్యంనాయుడు, బ్యాంక్ ఆఫ్ బరోడా డిప్యూటీ రీజినల్ మేనేజర్ ఎవి.భాస్కరం, సహాయ లీడ్ బ్యాంక్ మేనేజర్ జి.శ్రీధర్, యుబిఐ మేనేజర్ బి.చిట్టిబాబు, డిపిఎంలు వై.జనార్ధనరావు, వి.హేమంత్‌కుమార్ పాల్గొన్నారు.

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్‌డిఎ పీడీ మూర్తి

ఉపాధ్యాయులను సత్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

ప్రజాశక్తి - తాళ్లపూడి

సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి డి.మనోజ్ కుమార్ అన్నారు. జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న తాళ్లపూడి మండలంలోని ఉపాధ్యాయులను మంగళవారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. తాళ్లపూడి లోని శ్రీ పరస పద్మ రాజారావు జడ్‌పి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకున్న ఎం.రాజకుమారి, రామ్మోహన్ రావు, పి.శ్రీనివాసరావులను సత్కరించారు. యుటిఎఫ్ మండల అధ్యక్షులు బి.శంకర్ అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు బి.విజయబాబు, మండల ప్రధాన కార్యదర్శి టి.క్రాంతికుమార్, జిల్లా ఆడిట్ మెంబర్ రవి, మహిళా సంఘం ఉపాధ్యక్షులు కృష్ణవేణి పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాగేశ్వరరావు కుటుంబానికి బియ్యం పంపిణీ

ప్రజాశక్తి - చాగల్లు

ఇటీవల అధిక వర్షాల వల్ల ఇల్లు కూలిపోవడంతో నిరాశ్రయులైన కలవలపల్లి గ్రామ శివారు రామచంద్రపురానికి చెందిన యజమాని ఈర్లగడ్డ నాగేశ్వరరావు కుటుంబానికి మంగళవారం ఎంఎల్‌ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు చేతుల మీదగా బియ్యం పంపిణీ చేశారు. ప్రభుత్వం పరంగా ఆర్థిక సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.మెరికమ్మ, కూటమి నాయకులు పాల్గొన్నారు

కళాశాల విద్యార్థుల రక్తదానం

ప్రజాశక్తి- కొవ్వూరు

ఒకరు రక్తదానం చేస్తే ముగ్గురు ప్రాణాలను కాపాడొచ్చని ఎబిఎన్‌పిఆర్‌ఆర్ కళాశాల ప్రిన్సిపల్ ఎం.రామ్మోహన్ అన్నారు. మంగళవారం స్థానిక ఎబిఎన్‌పిఆర్‌ఆర్ కళాశాలలో కొవ్వూరు ప్రభుత్వాసుపత్రి సిబ్బంది ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 54 మంది విద్యార్థులు, అధ్యాపక సిబ్బంది రక్తదానం చేశారని రక్త నిధి వైద్యాధికారి డాక్టర్ పి.సుజాత తెలిపారు. జాతీయ సేవాపథకం, ఉన్నత భారత్ అభియాన్ శాఖల ఆధ్వర్యంలో విద్యార్థులు రక్తదానం చేశారని వైస్ ప్రిన్సిపాల్, ఉన్నత భరత్ అభియాన్ ఆర్డినేటర్ డాక్టర్ రమేష్ తెలిపారు.. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వై.రవీంద్ర, బి.సత్యనారాణయ, ఎన్.శివన్నారాయణ, పిఎస్.ప్రవీణ్, ప్రభుత్వ రత్ననిధి ప్రతినిధులు ఎ.నీలిమ, అరుణ్ కుమార్, ఎం.రాజేష్ సిహెచ్.మంగాదేవి, వై.నవీన్ అధ్యాపకలు పాల్గొన్నారు.

యోగా పోటీల్లో చాగల్లు విద్యార్థులకు తృతీయ స్థానం

ప్రజాశక్తి - చాగల్లు

హేట్‌స్టాఫ్ లెర్నింగ్ ఫౌండేషన్ వారు ఈనెల 14న నిర్వహించిన ఆన్‌లైన్ యోగా పోటీలలో చాగల్లు మండలం చాగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అండర్ 8 సంవత్సరాల విభాగంలో దొంగ కళ్యాణ్, కండి బోయిన బాలసుబ్రమణ్యం తతీయ స్థానం సాధించారని జడ్.పి.హెచ్ యోగ టీచర్ జె గణేష్ తెలిపారు. ఈ విజయం పట్ల ఇన్చార్జి హెచ్ఎం రాళ్లపల్లి వరప్రసాద్ పిడి జె విజయలక్ష్మి మరియు ఎస్ఎంసి కమిటీ చైర్మన్ గోపాలకష్ణ ఉపాధ్యాయ సిబ్బంది గ్రామ పెద్దలు గ్రామస్తులు అభినందించారు.

యూరియా గొడౌన్‌లో తనిఖీలు

ప్రజాశక్తి - సీతానగరం

ములకల్లంక ప్యాక్స్‌లో మంగళవారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. స్టాకు, రికార్డులను పరిశీలించారు. రికార్డులు, నిల్వలు అన్నీ సక్రమంగా ఉన్నట్లు వారు గుర్తించారు. రైతులందరికీ యూరియా సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని ప్యాక్స్ సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి ఎ.గౌరీదేవి మాట్లాడుతూ రైతులు నిల్వలను గురించి ఆందోళన చెందకుండా అవసరమైనప్పుడు యూరియాను తీసుకోవచ్చని తెలిపారు.

ఆర్‌పిలే మెప్మా రథ సారథులు

జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం.కనకరాజు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

మెప్మా పథకాలకు ముఖ్య రథసారథులు ఆర్‌పిలేనని జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం.కనకరాజు అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని పిజిఆర్‌ఎస్ హాల్లో మెప్మా పథకాలు అమలుపై ఆర్‌పిలతో ఆయన మంగళవారం సమీక్ష నిర్వహించారు. స్వయం సహాయక సంఘాలకు ఎస్‌హెచ్‌జి రుణాలు, బ్యాంకు లింకేజీ రుణాలతో పాటు సూర్య ఘర్, పిఎం స్వానిధి సహా పలు అంశాలపై చర్చించారు. ప్రతి సంఘ సభ్యురాలు డేటాను ఆన్ లైన్‌లో సక్రమంగా పొందుపరచాలని, సంఘాల మీటింగ్‌లు సక్రమంగా జరిగేలా చూడాలని సూచించారు. పొదుపు సంఘాలపై అవగాహన కల్పించి మహిళలు చేరేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఎంఎం వి.రామలక్ష్మి, టెక్నికల్ ఎక్స్‌పర్ట్ ఎం.ఫణికుమార్, పి.శ్రీదేవి, టిఎంసి సాయికుమార్, కమ్యూనిటీ ఆర్గనైజర్లు, రీసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.

కూటమి పాలనలో సంక్షేమం కరువు

ప్రజాశక్తి - తాళ్లపూడి

సూపర్ సిక్స్ పథకాల పేరుతో ప్రజలను మోసగించి అధికారులకు వచ్చిన కూటమి ప్రభుత్వ పాలనలో సంక్షేమం కరువైందని, అభివద్ధి ఎక్కడ జరిగిందని? వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త తలారి వెంకట్రావు అన్నారు. తాళ్లపూడిలో మంగళవారం జరిగిన 'బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో బూటకపు పాలన కొనసాగుతోందన్నారు. ఇసుక, మద్యం వంటి పథకాలలో దాచుకో దోచుకో అనే విధంగా పాలన ఉందన్నారు. నవరత్నాల పేరుతో అన్ని రకాల సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఇంటికి వెళ్లి అందించిన ఘనత వైసిపి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. గత ప్రభుత్వానికి ప్రస్తుత ప్రభుత్వానికి ఉన్న తేడాను ప్రతీ పౌరుడు గుర్తించి అధికార పార్టీని ప్రశ్నించాలన్నారు. ఈ కర్యాక్రమంలో వైకాపా రాష్ట్ర కమిటీ నాయకులు విజయరాజు, ఎంపిపి జొన్నకూటి పోసిరాజు, జిల్లా ఉపాధ్యక్షులు కాకర్ల వెంకటేశ్వరరావు, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షులు కొమ్మిరెడ్డి పరశురామారావు, ఎస్‌సి సెల్ కార్యదర్శి పిట్టా శ్రీనివాస్, తోట రామకృష్ణ, సర్పంచ్ డాక్టర్ గండి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్నతలారి వెంకట్రావు

గ్రామాభివృద్ధికి కూటమి సర్కారు కృషి

ప్రజాశక్తి - గోపాలపురం

గ్రామాల అభివృద్ధికి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని ఎంఎల్‌ఎ మద్దిపాటి వెంకటరాజు అన్నారు. మండలంలో ఆయన మంగళవారం పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తొలుత సామాజిక ఆరోగ్య కేంద్రంలో నూతనంగా నియమించిన అభివృద్ధి కమిటీ డైరెక్టర్లు పడమటి శ్రీనివాస్, పోసిన గణపతిశ్రీనివాస్, పెనుగొండ శ్రీనివాస్‌లతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. రోగుల పట్ల మానవత్వంతో వ్యవహరించాలన్నారు. ప్రజలకు మరింత నమ్మకం కలిగించేలా వైద్య సేవలు అందించాలన్నారు. దీని కోసం డైరెక్టర్లు కృషి చేయాలని సూచించారు. అనంతరం మండలంలోని తొక్కిరెడ్డిగూడెంలో 22 మంది లబ్ధిదారులకు పొజిషన్ సర్టిఫికెట్లను అందజేశారు. గుడ్డిగూడెంలో రూ.25 లక్షలతో నిర్మించిన సిసి రోడ్డును ప్రారంభించారు. ఎస్‌సి కాలనీలో రూ.70లక్షలతో నిర్మించే సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. నూతన సచివాలయం, హెల్త్ క్లినిక్ సెంటర్‌ను ప్రారంభించారు. ఎన్‌టిఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి దొడ్డిగర్ల సువర్ణరాజు, గంద్రోతు శ్రీనివాసరావు, సత్తనపల్లి శీను, గుడ్డిగూడెం సర్పంచ్ మడిచర్ల ప్రసాద్ కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆస్పత్రి కమిటీ డైరెక్టర్లతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎంఎల్‌ఎ మద్దిపాటి

సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ప్రజాశక్తి - చాగల్లు

ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంఎల్‌ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు అధికారులను హెచ్చరించారు. స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపిపి మట్ట వీరస్వామి అధ్యక్షతన మంగళవారం సర్వసభ్య సమవేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంఎల్‌ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, మౌలిక వసతులు, ఇతర సమస్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. వర్షాకాలంలో ప్రజలకు ఎటువంటి ఆటంకాలు లేకుండా శానిటేషన్ పనులను నిర్వహించాలన్నారు. అలాగే పలు శాఖల్లో పనులు నత్తనడకన సాగుతుండటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల సమావేశంలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు అన్ని శాఖ అధికారులతో సమావేశమై ప్రజా సమస్యల పరిష్కార కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ నాదెళ్ల శ్రీరామచౌదరి, ఎఎంసి మాజీ చైర్మన్ ఆళ్ల హరిబాబు, తహవీల్దార్ ఎం.మెరికమ్మ, ఎంపిడిఒ ఆర్.శ్రీదేవి, ఎంపిటిసి సభ్యులు, సర్పంచ్‌లు, సొసైటీ అధ్యక్షులు గ్రామ పంచాయితీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు

లక్ష్య సాధనతో పాటూ విలువలు ముఖ్యం

ప్రజాశక్తి - రాజానగరం

లక్ష్య సాధనకు నిజాయతీగా కృషి చేయాలని విసి ఎస్.ప్రసన్నశ్రీ విద్యార్థులకు సూచించారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎన్‌టిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, సైన్స్ అండ్ హ్యుమానిటీస్ ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థులకు "దీక్షారాంభ్" ఇండక్షన్ ప్రోగ్రామ్‌ను మంగళవారం నిర్వహించారు. దీనికి విసి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విశ్వవిద్యాలయ జీవితం విద్యార్థులకు స్వేచ్ఛను అందిస్తుందన్నారు. బాధ్యతతో కూడిన స్వేచ్ఛ మెరుగైన జీవితాన్ని ఇస్తుందన్నారు. నాలుగు సంవత్సరాల ఇంజినీరింగ్ విద్యకు మూడు ప్రాథమిక సూత్రలు అవలంబించాలని సూచించారు. అభ్యాసానికి మొదటి ప్రాధాన్యతనివ్వాలని, తరగతులకు క్రమం తప్పకుండా హాజరు కావాలని, ప్రయోగశాలలు, లైబ్రరీ వంటి వాటిలో ఎక్కువ సమయం గడపాలన్నారు. విద్యార్థులు స్నేహ పూర్వకంగా మెలగాలన్నారు. వచ్చిన ప్రతి అవకాశాన్ని ఉపయోగించుకోవాలని, ఇంటర్న్‌షిప్‌లు, వర్క్‌షాప్‌లు, సెమినార్లు, సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడలు, ఎన్‌ఎస్‌ఎస్ వంటి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ అధ్యాపకలు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న విసి ప్రసన్నశ్రీ

స్వస్థ్ నారీ - సశక్త్ పరివార్ అభియాన్‌ను ఉపయోగించుకోవాలి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

'స్వస్థ్ నారీ– సశక్తి అభియాన్' కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉండ్రాజవరం పిహెచ్‌సి వైద్యాధికారి బి.దుర్గామహేశ్వరరావు మహిళలకు సూచించారు. బుధవారం నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో ఆరోగ్య అవసరాలను గుర్తించి, తగిన వైద్య సలహాలు, సదుపాయాలు అందిస్తారన్నారు. ఎన్‌సిడి స్క్రీనింగ్, టిబి గుర్తింపు, రక్తహీనత, గర్భిణులకు ప్రసవానంతర వచ్చే ఆరోగ్య పరీక్షలు, రోగనిరోధక టీకాలు, రుతుక్రమ ఆరోగ్య అవగాహన, పోషణ ప్రోత్సాహం, రక్తదానం శిబిరాలు, పిఎంజెఎవై, ఆయుష్మాన్ కార్డుల నమోదు వంటి కార్యక్రమాలు చేపడతామన్నారు. ఇందులో భాగంగా సంచార వైద్య శిబిరాలను నిర్వహిస్తామన్నారు.

చాగల్లు : స్వస్థ్ –సశక్తి పరివార్ అభియాన్‌ను ఉపయోగించుకోవాలని డాక్టర్ తనుజ తెలిపారు మండలంలో అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల్లో మహిళలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు.

కౌలు రైతుల సమస్యల పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి - కరప

కౌలు రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.రాజశేఖర్, వళ్ల రాజబాబు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక భవన నిర్మాణ కార్మికులు భవనంలో ఎడ్ల కృష్ణ అధ్యక్షతన సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వడానికి వ్యవసాయ శాఖ అధికారులు ఈ క్రాప్ చేయించాలన్నారు. కౌలు రైతులు పంట అమ్ముకోవడానికి హక్కు కల్పించాలని కోరారు. రాష్ట్రంలో కౌలు చట్టం ఉనికిలో లేదని, రాష్ట్ర ప్రభుత్వం చట్టం చేయాలని ఇప్పటికే పలు దఫాలుగా ప్రభుత్వానికి వినతులు ఇచ్చామని, దీనిపై ప్రభుత్వం స్పందించాలని సమావేశం డిమాండ్ చేసింది. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు రాంప్రసాద్ తదితరులు మాట్లాడారు.



జిఎస్.రావును పరామర్శిస్తున్న మెగాస్టర్ చిరంజీవి దంపతులు

జిఎస్.రావుకు చిరంజీవి దంపతుల పరామర్శ

ప్రజాశక్తి -కొవ్వూరు

హైదరాబాద్‌లోని ఎఐజి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కొవ్వూరు మాజీ ఎంఎల్‌ఎ జిఎస్.రావును సినీ హీరో చిరంజీవి, సురేఖ దంపతులు మంగళవారం పరామర్శించారు. కొంత కాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న చిరంజీవి ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడి ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. వారి వెంట నిడదవోలు మాజీ ఎంఎల్‌ఎ జి.శ్రీనివాసనాయుడు ఇతర కుటుంబ సభ్యులు ఉన్నారు.

ఓజోన్ డే సందర్భంగా సదస్సు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఆర్ట్స్ కళాశాల రసాయన శాస్త్ర విభాగం "ప్రపంచ ఓజోన్ దినోత్సవం" సందర్భంగా వన్ డే అంతర్జాతీయ సదస్సును నిర్వహించారు. ఈ అంతర్జాతీయ సదస్సును "అకాడమియా– ఫార్మా సమన్వయం: సుస్థిర భవిష్యత్తు కోసం సేంద్రియ సంశ్లేషణ మరియు ఔషధ ఆవిష్కరణలను అభివద్ధి చేయటం" అనే అంశంపై నిర్వహించారు. ముఖ్య వక్తగా ఎవరెస్ట్ ఆర్గానిక్స్ లిమిటెడ్ కన్సల్టెంట్ డాక్టర్ ఎ.వీరా రెడ్డి, ఐఐసిటి చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ పి.మంగళగౌరీ, ఐఐటి మద్రాస్ ప్రొఫెసర్ బీరయ్య బైరై, ఎన్‌ఎటిసిఐ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ టి.శ్రీనివాసు, నన్నయ ప్రొఫెసర్ జగన్మోహన్‌రెడ్డి హాజరయ్యారు. పరిశోధనలను, ఫార్మాలో ఉన్న ఉద్యోగ అవకాశాలను, విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రామచంద్ర ఆర్.కె మాట్లాడుతూ ఇటువంటి సదస్సులు పరిశోధన పట్ల ఆసక్తిని పెంచుతాయన్నారు. ఈ సందర్భంగా పరిశోధకులు సమర్పించిన వివిధ పరిశోధన పత్రాలతో కూడిన సదస్సు సావనీర్‌ను ఆవిష్కరించారు. ఈ సదస్సులో వేరువేరు కళాశాలలకు చెందిన అధ్యాపకులు పరిశోధకులు, విద్యార్థులు, సదస్సు కన్వీనర్ శ్రీనివాస్‌రావు, ఆర్గనైజషన్ సెక్రటరీ డాక్టర్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న విసి

నేడు క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ట్రైనింగ్

ప్రజాశక్తి - రాజానగరం

ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లోని ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు ఈనెల 17వ తేదీ నుంచి 19వ తేదీ వరకు క్యాంపస్ రిక్రూట్మెంట్ ట్రైనింగ్ ఉంటుందని విసి ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను విసి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పిఎం.ఉషా సహకారంతో యూనివర్సిటీలోని ఇసిఇ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు ఎస్‌డివివిఎల్ సంస్థ వారు క్యాంపస్ రిక్రూట్మెంట్ ట్రైనింగ్ అందిస్తారన్నారు. మాస్టర్ ఆప్టిట్యూడ్, ఇంటర్వ్యూలు, టెక్నికల్ స్కిల్స్, కెరీర్ గైడెన్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, ఇండస్ట్రీకి అనువుగా సిద్ధం చేయడం వంటి అంశాలపై శిక్షణ అందిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని ప్లేస్‌మెంట్ సెల్ అండ్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఆధ్వర్యంలో ప్లేస్‌మెంట్ ఆఫీసర్ బి.జగన్మోహన్‌రెడ్డి నిర్వహిస్తారన్నారు.

జెవివి పర్యావరణ రాష్ట్ర కమిటీకి చిలుకూరి

ప్రజాశక్తి-కడియం

జెవివి పర్యావరణ విభాగం రాష్ట్ర కమిటీలో తూర్పు గోదావరి జిల్లాకు చెందిన చిలుకూరి శ్రీనివాసరావుకు చోటు దక్కింది. ముగ్గురు సభ్యుల బృందాన్ని జెవివి రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కెఎస్.లక్ష్మణరావు, టి.సురేష్ మంగళవారం ప్రకటించారు. కోనసీమ జిల్లా నుంచి కెవివి.సత్యనారాయణ కన్వీనర్‌గా, కో–కన్వీనర్లుగా తూర్పుగోదావరి జిల్లాకు చెందిన చిలుకూరి శ్రీనివాసరావు, చిత్తూరు జిల్లాకు చెందిన జి.సుధాకర్‌లను ఎంపిక చేశారు. మూఢ విశ్వాసాలను పారదోలడానికి, సాంకేతిక దృక్పథాన్ని ప్రజలకు అలవర్చడానికి శక్తివంశన లేకుండా కృషి చేస్తామని చిలుకూరి తెలిపారు.

నేడు నన్నయలో డాక్టర్ రెడ్డీస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్

ప్రజాశక్తి - రాజానగరం

2024–25 విద్యా సంవత్సరంలో బిఎస్‌సి, ఎంఎస్‌సి కెమిస్ట్రీ లేదా బయోటెక్నాలజీ చేసిన విద్యార్థులకు ఆదికవి నన్నయ యూనివర్సిటీలో 17న డాక్టర్ రెడ్డీస్ సంస్థ రిక్రూట్మెంట్ డ్రైవ్ నిర్వహిస్తుందని విసి ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. విశ్వవిద్యాలయం పరిధిలోని అర్హత గల విద్యార్థులంతా దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 2024–25 విద్యా సంవత్సరంలో బిఎస్‌సి, ఎంఎస్‌సి కెమిస్ట్రీ లేదా బయోటెక్నాలజీ పూర్తి చేసి, 10వ తరగతి నుంచి పీజీ వరకు 60శాతం ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు అర్హులన్నారు. బిఎస్‌సి వారికి వార్షిక వేతనం రూ.2.10 లక్షలు, ఎంఎస్‌సి వారికి రూ.2.60 లక్షలు వేతనం ఇస్తారని తెలిపారు. అలాగే ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులకు అవకాశం కల్పిస్తారన్నారు.

కాకినాడ 4వ జిల్లా జడ్జి గారి కోర్టులో
G.O.P. 74/2025
Between:
1.శ్రీమతి అయలూరి మోహిని పార్వతి
2. అయలూరి కార్తికేయ ఈశ్వర జగన్నాద్
(మైనర్ రిప్రజెంటెడ్ బై మదర్ శ్రీమతి అయలూరి మోహిని పార్వతి) ...పిటీషనర్లు
మరియు
నిల్ ...రెస్పాండెంట్
టు :
ది జనరల్ పబ్లిక్
పైన తెలిపిన పిటీషనర్లు ఉభయులు పై నెంబరుగల పిటీషన్ G.O.P.74/2025 ను పై కోర్టువారి ముందు దాఖలు చేసి, షెడ్యూలు ఆస్తిలో మైనరైన 2వ పిటీషనరు యొక్క అనిర్దిష్ట వాటాను క్రియ పర్చుటకు అనుమతిని ఇవ్వవలసినదిగా కోరివున్నారు. ఈ పిటీషన్ పై ఎవరికైనను ఎటువంటి అభ్యంతరములు వున్నను, వారు తమ అభ్యంతరములను **ది. 07-10-2025** వ తారీకు **ఉదయం 10 గంటలకు** పై కోర్టు వారి ముందు హాజరై తెలుపుకొనవచ్చును. లేనిచో అభ్యంతరములు లేనివిగా పరిగణించి కోర్టు వారు ఈ పిటీషన్ పై తగు తీర్పును ఇవ్వగలరు. కోర్టు వారి అనుమతితో ఈ ప్రకటన జారి చేయడమైనది.
యస్.కె. మొహిద్దీన్
యస్. ఏజాజుద్దీన్, యస్.హాజరత్ అలి,
అడ్వకేట్స్‌డో.నెం. 20-4-27,
మొహిద్దీన్ స్ట్రీట్, కాకినాడ.
కాకినాడ.
ది. 16-09-2025
సెల్: 9440109900

పాస్‌పోర్ట్ పడిపోయినది
అయినవిల్లి మండలం, మాగం గ్రామం, వి ఆర్ కాలనీకి చెందిన **నక్కా సుధారాణి,** C/o. నక్కా నరసింహమూర్తి కి చెందిన **Y3884419** నెంబరు గల పాస్‌పోర్ట్ పడిపోయినది. జిరాక్స్ నిమిత్తము 18 సెప్టెంబరు 2025న మాగం, వి ఆర్ కాలనీ లో మా ఇంటి నుండి అనాతవరం వెళ్తూ ఉండగా మార్గమధ్యలో పడిపోయినది. దొరికిన వారు క్రింది అడ్రస్‌కు అందజేయగలరు.
అడ్రస్: నక్కా సుధారాణి
C/o. నక్కా నరసింహమూర్తి, మాగం,
వి.ఆర్.కాలనీ, అయినవిల్లి మండలం- 533577
డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా,
సెల్: 9010021164

మహారాజశ్రీ అమలాపురం గౌరవ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
E.P. No. 47/2018
O.S. No. 401/2013
Between:
D.Hr: తేతలి రాధాకృష్ణ రెడ్డి
AND
J.Dr: చిట్టూరి సునీత
ఈ నెంబర్ డిక్రీ బాకీకి గాను ఈ దిగువ షెడ్యూల్ ఆస్తిపై కోర్టు వారి ఎదుట ది. 06–10–2025వ తేదీన ఉదయం 10.30 గం॥ లగాయతు వేలం కాబడును. కావలసినవారు వచ్చి యిస్తిహాజరు షరతులకు లోబడి పాడుకోవచ్చును.
షెడ్యూలు: (తూ॥గో॥జిల్లా) డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం సబ్ రి., అమలాపురం మున్సిపాలిటీ నారాయణపేట J.Dr తాలూకు వేలం కావలసిన సొత్తు యొక్క షెడ్యూలు అమలాపురం మున్సిపాలిటీ నారాయణపేట, ఆర్.ఎస్. నెం. 430/2 లో పడమర వైపు 125 గజాలు = 104.5 Sq.mts లో 165 గజములలో 0.84 సెంట్లు పూరా హద్దులు.
తూర్పు: 'A' షేర్ ఇన్ ది సైట్ అండ్ లెట్రిన్స్ బాత్‌రూమ్స్. **దక్షిణం:** కాంపౌండ్ వాల్ ఆఫ్ కడిమెళ్ళ రవి. **పడమర:** మున్సిపాలిటీ సిమెంటు రోడ్. **ఉత్తరం:** కుడిపూడి సుబ్బారావు ఇల్లు.
సదరు హద్దుల మధ్య స్థలమైన షెడ్యూల్ దాఖలా స్థిరాస్తిలో డోర్ నెంబర్ 3–3–23/15 నిర్మించిన డాబా ఇంటితో సహా కిటికీలు, ద్వారబంధాలు, పై కప్పు, ఎలక్ట్రికల్ ఫిట్టింగ్స్ మరియు దారి మార్గాలు, నీటి వనరులు సమస్తం ఈజిమెంట్ హక్కులతో సహా.
D.Hr. Value: Rs. 11,00,000/-
Amin Value: Rs. 16,00,000/-
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
డి.వి.వి.ఎస్.మూర్తి (బాబీ)
అమలాపురం
అడ్వకేట్, అమలాపురం
ది.14–09–2025
సెల్: 9848344577